**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ : గురువారం సా : 6.35 గం.

సహర్ : శుక్రవారం ఉ: 4.45 గం.

# సర్వేంతర్యామి..!

## ఓటరు అంతరంగంపై అభ్యర్థుల నజర్



- అభిప్రాయ సేకరణకు సర్వే ఏజన్సీలు
- పల్లెలు, పట్టణాల్లో సరళిపై ఆరా
- సర్వే రిపోర్టుల ఆధారంగానే ప్రచారంలో మార్పులు
- ఎత్తుగడల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు నిమగ్నం
- మెదక్ పార్లమెంటు పరిధిలో ఎన్నికల హడావుడి

సిద్దిపేట నియోజకవర్గంలోని ఓ హోటల్‌కు ఒకరు వెళ్లారు. ఛాయ్ తాగుతూ ఆ హోటల్ యజమానిని ముచ్చట్లలో దింపాడు. మెదక్ ఎంపీగా ఏ పార్టీ అభ్యర్థి గెలవొచ్చని ప్రశ్నలు వేశాడు. సదరు యజమాని ఒక పార్టీ గురించి వ్యతిరేక వ్యాఖ్యలు చేశాడు. ఆ పార్టీ తప్పిదాలపై మాట్లాడాడు. తర్వాత రెండ్రోజులకు ఆ యజమానికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. 'అన్న.. మనసులో ఏమీ పెట్టుకోకే. ఈసారి మా పార్టీకే నువ్వు సపోర్ట్ చెయ్యి. అట్లాగే నీ హోటల్‌కు వచ్చేవాళ్లకు కూడా మన పార్టీ గురించి మంచిగా చెప్పండి' అంటూ అవతలి వ్యక్తి అనడంతో కంగుతిన్నాడు. తన మాటలు అక్కడిదాకా ఎలా వెళ్లాయో తెలియక తల పట్టుకున్నాడు.

...ఇలాంటి అనుభవాలు మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలోని చాలా మందికి ఎదురవుతున్నట్లుగా తెలుస్తున్నది. పోలింగ్‌కు ఇంకా 40 రోజులకు పైగా సమయం ఉండడంతో ఓటరు మదిలో ఏముందో తెలుసుకునేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 3:




మెదక్ పార్లమెంటుకు సంబంధించి ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి నీలం మధు బరిలో ఉన్నారు. ముగ్గురు అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే, ఎవరికివారు ప్రచార పంథాను ఎప్పటికప్పుడు మార్చుకోవడం కనిపిస్తున్నది. ఈ మార్పులకు కారణం సర్వే సంస్థలు అందజేస్తున్న నివేదికలేనని తెలుస్తున్నది. సర్వే రిపోర్టుల ఆధారంగానే ప్రచార ఎత్తుగడలు మారుతున్నాయి. మే 13వ తేదీన పార్లమెంటు ఎన్నికల పోలింగ్ జరగనుంది. కేవలం 40 రోజుల సమయం మాత్రమే ఉంది. పార్లమెంటు పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, 60కి పైగా మండలాలు, వెయ్యికి పైగా గ్రామాలు, 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఉన్న సమయంలోనే ఇవన్నీ పర్యటించాలంటే అభ్యర్థికి కత్తిమీద సాములాంటిదే. అందుకే ఎక్కడ వ్యతిరేకంగా ఉందో, ఏయే చోట అనుకూలంగా ఉందో ముందే పసిగట్టడానికి సర్వే సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు తమకు అందించే బాధ్యతను సర్వే ఏజన్సీలకు అప్పగించారు.

### కులాలు, వర్గాలపై ఫోకస్..

ఎన్నికల్లో అన్ని కులాలు, వర్గాల ప్రభావం ఉంటుంది. ఏయే కులం మద్దతు ఎవరికి ఉందనే విషయం కూడా పోలింగ్‌కు కొద్దిరోజుల ముందు తెలిసిపోతుంది. యువత, మహిళలు, రైతులు, బీడీ కార్మికులు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు.. తదితరవర్గాల అభిప్రాయాలు సైతం కీలకం కానున్నాయి. అందుకే అభ్యర్థులు కులాలవారీగా సర్వేలు చేయిస్తున్నారు. ఏదైనా కులం లేదా వర్గం వ్యతిరేకంగా ఉన్నా.. అందుకు కారణాలను విశ్లేషిస్తున్నారు. వ్యతిరేకంగా ఉన్న కులం మద్దతును కూడగట్టుకోవడానికి ఈ విధానం సులభమవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లుగా తెలుస్తున్నది. అందుకే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రత్యేకంగా కులాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా యువత, మహిళలు, రైతుల ఓట్లను పొందడానికి అనేక ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగుల ఓటర్ల మనోభావాలను సేకరిస్తున్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో 2లక్షలకు పైగానే బీడీ కార్మికులు ఉంటారు. వీరి అభిప్రాయాలు సైతం గుట్టుగా రాబడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు, టీచర్లు, వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, లాయర్లు, వైద్యులు ఇలా రకరకాల వర్గాల మనసులో మాటను తెలుసుకునేలా ఈ సర్వే సంస్థలు లోతుగా పనిచేస్తున్నాయి.

### ప్రచార హడావుడి షురూ

ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో ప్రచార హడావిడి ఊపందుకుంది. నామినేషన్లకు ముందే క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తన అభ్యర్థిత్వం ఖరారైన వెంటనే ప్రచార రథాలను తయారుచేయించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి సైతం పెద్ద ఎత్తున ప్రచార రథాలను వినియోగిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అభ్యర్థులు, వారి పార్టీలకు సంబంధించిన పాటలు, సందేశాలతో ఈ ప్రచార రథాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. అంతేగాకుండా కళాబృందాలతో పాటు ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌లు కలిగిన వాహనాలను గ్రామాలు, పట్టణాల్లో తిప్పుతున్నారు. సర్వే సంస్థలు ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా సదరు పార్టీలకు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం చేయడం ద్వారా వారి మనసు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధిని ఒకవైపు.. భవిష్యత్తులో చేయబోయే పనుల గురించి మరోవైపు చెబుతూ జోరుగా ప్రచారం చేస్తున్నారు. అసంతృప్తిని వెళ్లగక్కిన కులాల పెద్దలు, వర్గాల పెద్దలు, పార్టీల్లోని అసమ్మతి నేతలను బుజ్జగించి మచ్చిక చేసుకోవడానికి సర్వే నివేదికలు ఉపయోగపడుతున్నాయి.

## గతాన్ని వదిలేయండి..

### సమన్వయంతో పనిచేయాలి

- నీలం మధు, కాట శ్రీనివాస్‌గౌడ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి
- మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, మంత్రులతో సమావేశం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్‌తో అభ్యర్థి నీలం మధు, ఎమ్మెల్యే రోహిత్, కాట శ్రీనివాస్‌గౌడ్, ఆవుల రాజిరెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు, ఏప్రిల్ 3: మెదక్ లోక్‌సభ స్థానంలో నాయకులు గతాన్ని పక్కనపెట్టి సమన్వయంతో పనిచేసి ఘన విజయం సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో సీఎం బుధవారం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ, జిల్లాకు చెందిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, అభ్యర్థి నీలం మధులతో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్షించారు. అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిల్లో ప్రచారానికి సంబంధించిన వివరాలను నియోజకవర్గ ఇన్‌చార్జిలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరు పార్టీల తరపున పోటీచేసిన కాంగ్రెస్ పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలంమధుతో ప్రత్యేకంగా మాట్లాడారు. కలిసి పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ లోక్‌సభ స్థానానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ఇందిరమ్మ చలువతోనే పారిశ్రామికవాడగా అభివృద్ధి చెంది వేలాది మందికి ఉపాధి కల్పించిందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, బీజేపీ పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిల్లో మెదక్ ప్రజల ఆశీర్వాదం కాంగ్రెస్ పార్టీకే ఉందని, నీలంమధు గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సీఎం సమావేశమయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి తదితరులతో మాట్లాడి నియోజకవర్గంలో పరిస్థితులు, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి చేరిక అంశంపై ఆరా తీశారు. సమావేశంలో సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పూజల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు

- సిద్దిపేట మున్సిపల్‌లో బీఆర్ఎస్‌కు గండి

7లో

## ఈవీఎం మెషీన్ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ మను చౌదరి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 3: ఈవీఎం మిషన్ల మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఈవీఎం మెషీన్ల రాండమైజేషన్‌ను కలెక్టర్ నేతృత్వంలో రాజకీయ పార్టీలు, రెవెన్యూ అధికారుల సమక్షంలో నిర్వహించారు. 1439 బ్యాలెట్ యూనిట్లు, 1439 కంట్రోల్ యూనిట్లు, 1611 వీవీప్యాట్‌లను జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి ఏఆర్వోలకు అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, హుస్నాబాద్ ఏఆర్వో రామ్మూర్తి, రాజకీయ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

### దొడ్డి కొమురయ్య జయంతి

కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ ఆధ్వర్యంలో బుధవారం దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. కలెక్టర్ మనుచౌదరి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారుల తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు మంచి రోజులు

- రుణమాఫీ, ఫసల్‌బీమా, ధాన్యానికి బోనస్
- రైతుభరోసా పెంచేందుకు ప్రభుత్వం ప్లాన్
- అన్ని అందితే అన్నదాతలకు నో ఫికర్

7లో

# ఇంతింతై..

## నాలుగేళ్లలో రవాణా శాఖకు రెండింతల ఆదాయం

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 కోట్ల ఆదాయం
- వాహనాలు పెరుగుతున్నా... లైసెన్స్‌ల తగ్గుదల
- లైఫ్ ట్యాక్స్‌తో ఆర్థికంగా వెన్నుదన్ను
- పెరిగిన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ అనుమతులు





ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 3 : రవాణా శాఖ ఖజానాకు ఆదాయం క్రమంగా పెరుగుతోంది. నాలుగేళ్ల క్రితం రూ.47 కోట్లకు పరిమితమైన ఆదాయం ఏకంగా రెండింతలైంది. తాజాగా ముగిసిన మార్చి వరకు.. అంటే 2023-24 సంవత్సరంలో రూ.87 కోట్ల ఆదాయం రావడం విశేషం. గతేడాదితో పోల్చితే వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్స్ సంఖ్య తగ్గినప్పటికీ రవాణా శాఖ చర్యల మూలంగా ఆదాయం మాత్రం పెరిగింది. జిల్లాలో సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయంతోపాటు గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాలలో ఎంవీఐ కార్యాలయాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో అన్ని కార్యాలయాలకు సరిపడా అధికారులతో భర్తీ చేశారు.

### ట్యాక్సుల ద్వారానే రూ.70 కోట్లు

రవాణా శాఖకు చెల్లిస్తున్న పన్నుల ద్వారానే ఆదాయ మార్గాలు సమకూరుతున్నాయి. కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న వాహనాలకు ఒకేసారి లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తుంటారు. ఇది నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. 2020-21 సంవత్సరంలో లైఫ్ ట్యాక్స్ ద్వారా రూ.29 కోట్లు సమకూరగా 2023-2024లో రూ.53 కోట్లు జమయ్యాయి. నాలుగేళ్ల వ్యవధిలోనే దాదాపు రూ.24 కోట్లు ఆదాయం పెరిగింది. ఇక గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు మూడు నెలలకు ఒకసారి క్వార్టర్లీ ట్యాక్స్ వసూలు చేస్తుంటారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.16 కోట్ల పైచిలుకు ఈ వాహన పన్ను వసూలైంది. అదేవిధంగా లైసెన్స్‌లు, వాహన రిజిరిస్ట్రేషన్ల ఫీజుల రూపంలో రూ.12 కోట్లు, సర్వీసు ఫీజుల ద్వారా రూ.3 కోట్ల ఆదాయం వచ్చింది. ప్రతీ వాహనదారుడు తప్పనిసరిగా ట్యాక్సు చెల్లించాలని రవాణా శాఖ అధికారులు సైతం అవగాహన కల్పిస్తున్నారు. లేదంటే తగిన చర్యలు తీసుకునేలా అప్రమత్తంగా ఉంటున్నారు. ఈ ఫలితంగానే పన్నుల ద్వారా రాబడి పెరిగినట్లుగా భావిస్తున్నారు.

| ఆర్థిక సంవత్సరం | 2020-2021 | 21-22 | 22-23 | 23-24 |
|---|---|---|---|---|
| రిజిస్ట్రేషన్ల సంఖ్య | 19,334 | 16,948 | 15,405 | 16,016 |
| డ్రైవింగ్ లైసెన్స్‌లు | 10,036 | 9927 | 11,199 | 6,780 |
| ఆదాయం (కోట్లలో) | 47.87 | 54.87 | 79.63 | 87.67 |

### ఏటేటా అంతర్జాతీయ లైసెన్స్‌ల పెరుగుదల

విదేశాల్లో ఉద్యోగాల కోసం, చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య పెరుగుతోందనడానికి రవాణా శాఖలో స్పష్టమైన గణాంకాలు ఉన్నాయి. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సుల కోసం స్థానికంగా అనుమతులు పొందడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు. గడిచిన నాలుగేళ్లలో క్రమంగా ఈ లైసెన్స్‌ల సంఖ్య పెరుగుతోంది. సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి 2021వ సంవత్సరంలో కేవలం 44 ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ పర్మిషన్(ఐడీపీ) పొందగా.. 2022లో 128, 2023లో 260, 2024 మార్చి వరకు 321 మందికి అనుమతి ఇచ్చారు. మళ్లీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఈ సంఖ్య 500కు చేరే అవకాశం ఉంది.

### లైసెన్స్‌లపై అనాసక్తి..

వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలనే నిబంధన ఉంది. దీనిపై ఇటు రవాణా శాఖ, అటు పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అయితే, జిల్లాలో వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ లైసెన్స్‌లు పొందేవారి సంఖ్య మాత్రం తగ్గుతుండడం గమనార్హం. 2020-21 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 10,036 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందారు. 2021-22లో 9,927 లైసెన్స్‌లు, 2022-23లో 11,199 లైసెన్స్‌లు జారీ చేయగా 2023-24లో 6,780 మాత్రమే లైసెన్స్‌లు పొందడం తగ్గుదలకు సూచికగా కనిపిస్తోంది. అయితే లర్నింగ్ లైసెన్స్ పొందిన వారిలో 60నుండి 70 శాతమే పర్మినెంట్ లైసెన్స్‌కు అర్హత సాధిస్తున్నారు. గతేడాది సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యువతకు ఉచిత లైసెన్స్‌లు అందించేలా ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. లెర్నింగ్ లైసెన్స్‌లు ఇచ్చాక పర్మినెంట్ లైసెన్స్‌లు తీసుకోవడంలో మాత్రం చాలా మంది ఆసక్తి చూపించలేదు. కార్యాలయంలో నిబంధనల ప్రకారమే లైసెన్సులు జారీ చేయడమే ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

# బీభత్సం.. భయానకం

**రియాక్టర్ పేలుడుతో భారీ శబ్దం**

**చెలరేగిన మంటలు.. ఆవరించిన పొగ**

- చెల్లాచెదురైన మృతదేహాలు.. ఎగిరిపడ్డ క్షతగాత్రులు
- ఎటు చూసినా హాహాకారాలు
- ఉలిక్కిపడిన చుట్టుపక్కల గ్రామాలు

హత్నూర, ఏప్రిల్ 3: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం రియాక్టర్లు పేలి ఐదుగురు మృత్యువాత పడటం, 20 మందికి పైగా గాయపడటంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురి మృతదేహాలు చెల్లాచెదురుగా.. రక్తం మడుగుల్లో పడి ఉండగా.. సుమారు 20 మంది వరకు గాయపడినట్లు చెబుతున్నారు. పలువురు గల్లంతవడంతో పరిశ్రమ శకలాలను పూర్తిగా పరిశీలిస్తే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే, తీవ్రంగా గాయపడినవారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో ఎప్పుడు ఎవరికేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రమాదంలో పొట్ట చేతపట్టుకుని పనుల కోసం వచ్చిన కార్మికులతో పాటు ఏకంగా పరిశ్రమ డైరెక్టర్ కూడా అక్కడికక్కడే మృతి చెందడంతో పారిశ్రామిక ప్రాంతంలో కలకలం సృష్టించింది.



క్షతగాత్రులను తీసుకెళుతున్న స్థానికులు

సాయంత్రం వేళ రియాక్టర్ వద్ద కార్మికులు పని చేస్తున్న సమయంలో అవి పేలినట్లు ప్రాథమికంగా తెలిసింది. కార్మికులు తెలిపిన కథనం ప్రకారం రియాక్టర్లు లీకవుతుండడంతో అక్కడ పని చేసే సిబ్బంది తమ పై అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో డైరెక్టర్, ప్రొడక్షన్ ఇన్‌చార్జి వచ్చి పరిశీలించారు. లీకేజీ అధికం కావడంతో కరెంటు నిలిపివేసి, బాయిలర్లను ఆఫ్ చేశారు. ఒత్తిడి పెరగడంతో బాయిలర్లు, రియాక్టర్లు ఒక్కసారిగా పేలిపోయి, మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల వ్యవధిలోనే దట్టమైన పొగ పరిశ్రమను కమ్మేసింది. పేలుడు తీవ్రతకు పరిశ్రమలో చాలాభాగం నేలమట్టమయింది. అందులో పనిచేస్తున్నవారు ఎగిరి దిక్కుకొకరు పడ్డారు. ప్రాణాలతో మిగిలినవారు పరుగులు తీశారు.

### తమవారేమయ్యారో తెలియక..

పేలుడు శబ్దం రావడం, మంటలు ఎగిసిపడడంతో ప్రమాదం జరిగినట్లు తెలుసుకుని కార్మికుల కుటుంబాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పరుగున చేరుకున్నారు. వెంటనే సహాయ చర్యలు ప్రారంభించినా శకలాల మధ్య బూడిదలో కూరుకుపోయిన మృతదేహాలు, క్షతగాత్రులను గుర్తించడం కష్టంగా మారింది. చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు, రక్తమోడుతున్న గాయాలతో క్షతగాత్రుల రోదనలతో ఘటనాస్థలాన్ని చూసి భీతిల్లారు. కార్మికుల కుటుంబసభ్యులు తమ వారేమయ్యారో తెలియక రోదిస్తూ శకలాల మధ్య వెతుకులాడడం కనిపించింది. జాడ తెలియకపోవడంతో వివరాలు తెలపాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రమాదం జరిగిన రెండు గంటల అనంతరం ఐదుగురు మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతుల్లో తమవారు లేకపోవడంతో కుటుంబసభ్యులు క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రులకు పరుగులు తీశారు.



పేలుడు తీవ్రతకు దెబ్బతిన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ

### కాలం చెల్లిన రియాక్టర్లు కావడం వల్లే..

ఎస్‌బీ ఆర్గానిక్స్ యూనిట్-1 పరిశ్రమలో కాలం చెల్లిన రియాక్టర్లను ఉపయోగించడంతోనే ప్రమాదం సంభవించినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. అంతేకాకుండా దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంతోపాటు బాయిలర్ పూర్తిగా శిథిలావస్థకు చేరినట్లు సమాచారం. ఇటీవల నామమాత్రపు మరమ్మతులు చేపట్టి కొనసాగిస్తున్నట్టు తెలిసింది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడమే ప్రధాన కారణమని స్థానికులు, కార్మికుల కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పెళ్లైన ఆరు రోజులకే వరుడి మృతి

● వ్రతం కోసం ఆటోలో వెళ్తుండగా ప్రమాదం



సత్యనారాయణ

నర్సాపూర్, ఏప్రిల్ 3 : సరిగ్గా ఆరు రోజుల క్రితం అతని వివాహం జరిగింది. నూతన వధువరులు సత్యనారాయణస్వామివ్రతం చేసేందుకు కటుంబీకులతో కలిసి ఆటోలో వెళ్తుండగా, అది ప్రమాదవశాత్తు బోల్తా పడి వరుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వడ్డెపల్లికి చెందిన మలుగుల పోచయ్య, బూదెమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమారుడు సత్యనారాయణ(24), ఇద్దరు కూతుళ్లు ఉండగా, కూతుళ్ల పెళ్లి ఇదివరకే అయింది. సత్యనారాయణకు గత నెల మార్చి 28న పెళ్లి అయింది. ఇంట్లో శుభకార్యం అయినందున కుటుంబం మొత్తం శివ్వంపేట మండలం చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద సత్యనారాయణ వ్రతం చేయాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం నూతన వధూవరులతో పాటు వరుడి తల్లిదండ్రులు, మరో ఇద్దరు ఆటోలో బయలు దేరారు. ఆటో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రోడ్డుపై నర్సాపూర్ పట్టణ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న నూతన వరుడు సత్యనారాయణతో పాటు బాలికకు గాయాలయ్యాయి. వెంటనే వారిని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్ ఆస్పత్రిలో సత్యనారాయణ మృతి చెందాడు. పెళ్లి అయిన ఆరు రోజులకే నూతన వరుడు మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తూప్రాన్ వద్ద రూ.లక్ష సీజ్

తూప్రాన్, ఏప్రిల్ 3: మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ శివారులో బుధవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. లక్ష సీజ్ చేసినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపారు. పట్టణ పరిధిలో 44వ జాతీయ రహదారిపై దాబా హోటళ్ల వద్ద వాహన తనిఖీల్లో భాగంగా ప్రైవేటు బస్సును తనిఖీ చేశారు. బస్సులో మహారాష్ట్ర గాంధీనగర్‌కు చెందిన గీతా కులకర్ణి వద్ద రూ. లక్ష పట్టుబడ్డాయి. సదరు నగదుకు సంబంధించి, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. తనిఖీల్లో తూప్రాన్ ఏఎస్‌ఐ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతం

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నాల్కర్

కొల్చారం, ఏప్రిల్ 3: ప్రకృతి వ్యవసాయంతోనే భూమి సారవంతం అవుతుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని తునికి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్‌డీ నాల్కర్ అన్నారు. కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేటలో మంజీరా రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం వద్ద ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాల్కర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూమిలో చౌడుశాతం పెరిగి, నిస్సారమవుతుందన్నారు. వర్షాకాలంలో సేంద్రియ ఎరువులతో పాటు జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రోగాం ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్, శాస్త్రవేత్త ప్రతాప్ రెడ్డి, మంజీరా రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు జితేందర్‌రెడ్డి(గణేష్ రెడ్డి), ఏఈవోలు నిరోషా, ప్రతిభ, అంబిక, వినీతభవానీ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి న్యాలకల్ ఎంపీపీ



కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ అంజమ్మ, తదితరులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 3: న్యాల్‌కల్ బీఆర్‌ఎస్ ఎంపీపీ అంజమ్మ బుధవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎంపీపీతోపాటు నాయకులు రాజ్‌కుమార్, నగేష్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పనులను చూసి పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆశోక్, రంజిత్, బలరాంరెడ్డి, వెంకట్ రెడ్డి, సునిల్, వడ్డీ రత్నం తదితరులు పాల్గొన్నారు.





● రుణమాఫీ, ఫసల్‌బీమా, ధాన్యానికి బోనస్
● విత్తన సబ్సిడీకి సమాయత్తమవుతున్న సర్కార్
● రైతుభరోసా పెంచేందుకు ప్రభుత్వం ప్లాన్
● అన్ని అందితే అన్నదాతలకు నో ఫికర్

# రైతన్నలకు మంచి రోజులు

గజ్వేల్, ఏప్రిల్ 3: రైతన్నలకు మంచి రోజులు రానున్నాయా అంటే అవుననే సమాధానమే వస్తుంది. నాలుగు నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలను చేపట్టింది. ఈ మేరకు కసరత్తును ప్రారంభించినట్లు తెలుస్తుంది. వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు అయ్యే ఖర్చును అంచనా వేస్తూ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్, రైతన్నల పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, విత్తనాలకు గతంలో అందించిన మాదిరిగా సబ్సిడీని అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇవన్నీ అమలు అయితే, జిల్లాలో రైతాంగానికి మేలు జరగనుంది.

### ఐదెకరాలలోపు లక్ష మంది..

సిద్దిపేట జిల్లాలో వానాకాలంలో 3,39,289 మంది రైతులు 5లక్షల 40వేల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తుండగా, రూ.322 కోట్ల 42లక్షల 24వేల 343లను రైతుబంధుగా అందిస్తుంది. ఇక యాసంగి సీజన్‌లో 3,45,782 మంది రైతులు మూడున్నర లక్షల ఎకరాల్లో ఆయా పంటలను సాగు చేస్తుండగా, రూ.322కోట్ల 93లక్షల 3వేల 613లను రైతుబంధును అందిస్తుంది. జిల్లాలో 3లక్షల 50వేల మంది రైతులు ఉండగా రెండున్నరెకరాలలోపు రైతులు దాదాపుగా 2లక్షల 25వేల మంది ఉన్నారు. ఐదు ఎకరాల లోపు దాదాపుగా లక్ష మంది ఉండగా, ఐదెకరాల పైబడిన రైతులు దాదాపుగా 25వేల మంది ఉన్నట్లు అధికారుల అంచనా వేశారు. ఐదు ఎకరాల లోపే రైతు బంధు ఇవ్వాలని సీలింగ్ విధించడంతోపాటు కేవలం పంట పొలాలకు రైతుబంధును అందిస్తే ప్రభుత్వ సొమ్ము ఆదా అవుతుంది.

### ఏటా పంట నష్టాలే..

సిద్దిపేట జిల్లాలో ఏటా వడగండ్లతో పంట నష్టపోతూనే ఉన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలతో వరి పంటకు నష్ట కలిగితే, ప్రస్తుత సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వలన పంటలకు నష్ట వాటిల్లింది. ప్రతి యాసంగి సీజన్‌లో వడగండ్లతో చిన్నకోడూరు, నంగునూరు, వర్గల్, బెజ్జంకి, హుస్నాబాద్, కోహెడ మండలాల్లో తీవ్రంగా పంటలకు నష్ట వాటిల్లుతుంటుంది. ఈ నేపథ్యంలో రైతులు పెట్టిన పెట్టుబడులకు తీవ్ర నష్టం వాటిల్లుతూ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధాన మంత్రి ఫసల్‌బీమాను అమలు చేస్తే రైతులు ధీమాగా ఉండవచ్చు. 2019లో అక్కన్నపేట మండలంలో ఫసల్ బీమాను అక్కడి వ్యవసాయాధికారి ప్రత్యేకంగా రైతులతో ప్రీమియం కట్టిస్తే వడగండ్లకు నష్టపోయిన రైతులకు రూ.2.8కోట్ల పరిహారాన్ని బీమా కంపెనీలు అందించాయి. ఫసల్ బీమాతో జిల్లా వ్యాప్తంగా 3లక్షల 50వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రీమియం విషయంలోనే ప్రభుత్వం ఆలోచన చేస్తుండగా, ప్రభుత్వం చెల్లించాలా... రైతు చెల్లించాలా అనే అంశంపై కసరత్తు చేస్తుంది.

### 1.75 లక్షల మంది రైతులకు ప్రయోజనం

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షలలోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తే సిద్దిపేట జిల్లావ్యాప్తంగా లక్షా 75వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేసింది. ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా దాదాపుగా రూ.450కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. తాజాగా ప్రభుత్వం రుణమాఫీ చేసేందుకు ప్రణాళిక చేస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా లక్షా 75వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశాలు ఉన్నాయి.

### రూ.500 బోనస్‌తో..

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వచ్చే వానాకాలం నుంచి రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్‌ను అందించేందుకు కసరత్తు చేస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో 3లక్షల 40వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తుండగా, జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఇందులో లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు సొంత అవసరాలకు వినియోగించుకుంటుండగా, దాదాపుగా ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వానికి కొనుగోలు కేంద్రాల్లో ప్రతి ఏటా విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్వింటాలుకు రూ.500 బోనస్ కల్పిస్తే రైతులకు అదనంగా రాబడి వచ్చే అవకాశం ఉంది.

# కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కౌన్సిలర్లు

● సిద్దిపేట మున్సిపల్‌లో బీఆర్‌ఎస్‌కు గండి
● అవిశ్వాసం ప్రవేశ పెడతాం
● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



మంత్రి కొండా సురేఖను కలిసిన మున్సిపల్ కౌన్సిలర్లు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సొంత నియోజకవర్గ కేంద్రమైన సిద్దిపేట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు గండిపడింది. ఈ మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు సాక్షి బాలలక్ష్మి ఆనంద్, శ్రీదేవి బుచ్చిరెడ్డి, రియాజ్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తుఇమామ్‌ల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో పలువురు కౌన్సిలర్లు తమతో టచ్‌లో ఉన్నారని, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెడతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మల యాదగిరి, గయాజుద్దీన్, షాబుద్దీన్, ఖలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మెదక్ కౌన్సిలర్లు, నాయకులు

### కాంగ్రెస్‌లోకి మెదక్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 3: మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్థానికంగా ఓటమి పాలవడం.. అటు అధికారంలో లేకపోవడంతో పార్టీని వీడేందుకు పలువురు కౌన్సిలర్లు, నాయకులు పావులు కదిపారు. స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులను పలుమార్లు కలిసి పార్టీలో చేరేందుకు సముఖత వ్యక్తం చేశారు. అదే విధంగా స్థానికంగా ఉన్న కాంగ్రెస్ నేతలు సైతం పార్టీలోకి కౌన్సిలర్లను ఆహ్వానించారు. దీంతో ఎట్టకేలకు పట్టణానికి చెందిన కౌన్సిలర్లు మేడి కళ్యాణి, జయశ్రీ, వసంతరాజ్‌లతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కో-ఆప్షన్ సభ్యులు మందుగుల గంగాధర్ మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో బుధవారం రాత్రి నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో పార్టీలో చేరారు. అదే విధంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడి మధుసూదన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గాప్రసాద్ కొండా శ్రీనివాస్, విక్రం ఉన్నారు. వీరితో పాటు న్యాయవాది జీవన్‌రావు, నాయకులు బొజ్జ పవన్, ఉప్పల రాజేష్, వెంకటరమణ, కానుగు భూపతిరాజు, ప్రవీణ్, హరిత, హఫీజొద్దీన్, గుడూరి కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించిన ఐలా అధికారి

మనోహరాబాద్, ఏప్రిల్ 3 : తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఐలా) మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం మనోహరాబాద్ మండలం కొండాపూర్, ముప్పిరెడ్డిపల్లిలోని ఐలా ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించారు. సీఈ శ్యామ్‌సుందర్, జోనల్ మేనేజర్ మాధవి బృందం ఆయనతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన పరిశ్రమలను పరిశీలించారు. వాటి యజమానులతో మాట్లాడారు. కొందరు పరిశ్రమల యజమానులు విద్యుత్ అంతరాయం ఉందని, సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సదుపాయం కల్పించాలని ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో యాజమానుల సంఘం జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, జాయింట్ సెక్రెటరీ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, కోశాధికారి అశోక్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్లు సత్యనారాయణ, దుర్గప్రసాద్, నవనీతకుమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్‌లో శ్రీకృష్ణ ప్లాస్టిక్ పరిశ్రమను పరిశీలిస్తున్న రాష్ట్ర ఐలా మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

## ట్రాన్స్‌ఫార్మర్ ను ఢీకొన్న టిప్పర్

● ఎనిమిది విద్యుత్ స్తంభాలు ధ్వంసం

రామాయంపేట, ఏప్రిల్ 3 : టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్ల రెండు ట్రాన్స్‌పార్మర్లు, ఎనిమిది విద్యుత్ స్తంభాలు ధ్వంసమయ్యాయి. రోడ్డు పనుల్లో భాగంగా మండల పరిధి తొనిగండ్ల శివారులో బుధవారం మట్టి అన్‌లోడ్ చేసి హైడ్రాలిక్‌తో వెళ్లగా ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రిప్ కావటంతో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.

# జాగ్రత్తలతోనే వడదెబ్బ నివారణ

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 3 : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. వడదెబ్బ నివారణ, పాటించాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆమె కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎండలు, వడగాలుల తీవ్రమవుతున్న కారణంగా ప్రజలువడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు. అందుకే అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని, బయటకు రావాల్సి వస్తే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి శశాంకదేశ్‌పాండే, సీనియర్ అసిస్టెంట్ వి.రవి తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్




ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 3: ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. స్వీప్ జిల్లా కోర్ కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో స్వీప్ ద్వారా విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. గతంలో పోలింగ్ తక్కువగా నమోదైన కేంద్రాలను గుర్తించి ఈసారి ఓటింగ్ శాతం పెరగడానికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో స్వీప్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు, డీఎస్‌వో రాజిరెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా స్త్రీశిశు సంక్షేమాధికారి బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో మెదక్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మెదక్, సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరువు నియోజకవర్గాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిటుర్ల, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల ర్యాండమైజేషన్‌ను ఈఎంఎస్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ... ఆన్‌లైన్ ద్వారా మొదటి విడత ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో 584 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 729 బ్యాలెట్ యూనిట్లు, 729(125 శాతం) కంట్రోల్ యూనిట్లు, 816 (140 శాతం) వీవీప్యాట్లను తొలి విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించామని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో నాలుగు జిల్లాల రేట్ చార్జీలను రూపొందించి సబంధిత జిల్లాలకు పంపించడం జరిగిందన్నారు. త్వరలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏకరూప ధరల పట్టికను ధ్రువీకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల పర్యవేక్షకులు, వివిధ రాజకీయ పార్టీ నేతలు పాల్గొన్నారు

# వైభవం..నృసింహుని బ్రహ్మోత్సవం



శేషవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

● నాచగిరి క్షేత్రంలో కొనసాగుతున్న స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలు
● శేష వాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహుడు



హారతినిస్తున్న అర్చకులు

వర్గల్, ఏప్రిల్ 3 : రాష్ట్రంలో రెండో యాదాద్రిగా ప్రసిద్ధిగాంచిన వర్గల్ మండల నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం లక్ష్మీనృసింహస్వామి వారికి ఆలయ వేద పండితులు శేషవాహనోత్సవ సేవ నిర్వహించారు. పూజా కార్యాక్రమాల అనంతరం సాయంత్రం స్వామివారిని ఆలయ ఉత్తర ద్వారం నుంచి కల్యాణ మండపం వరకు సర్వంగా సుందరంగా అలంకరించిన శేషవాహనంపై అధిష్టింపజేసి భాజ భజంత్రీలు, మేళతాళాల మధ్య లక్ష్మీ సమేత నరసింహాస్వామివారిని నాచగిరి పూర వీధులలో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యమైనాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. బ్రహోత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి గరుడోత్సవ సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

# వరి కోతలకు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● ఎంపీడీవో వేణుగోపాల్

నంగునూరు,ఏప్రిల్ 3 : రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని లక్ష్యంతో వరి కోతలకు ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని పాలమాకుల, గట్ల మల్యాల, ఖాతా గ్రామాలల్లో ఏపీఎం ఆంజనేయులుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవో గీత ,ఏఈవో అశోక్ సీసీలు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, వివోఏలు వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, ఉమా, కిష్టారెడ్డి, వీవో లీడర్లు గంగవ్వ, లక్ష్మి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

● కోహెడ: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని అదనపు డీఆర్డీవో మధుసూదన్ అన్నారు. బుధవారం శనిగరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. గుండారెడ్డిపల్లి గ్రామంలో డీపీఎం విద్యాసాగర్, మైసంపల్లి గ్రామంలో ఏపీఎం తిరుపతి ధాన్యం కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, 9 కేంద్రాలను ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. మిగతా కొనుగోలు కేంద్రాలు గురువారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు, సీసీలు పాల్గొన్నారు.

● గజ్వేల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఎంపీవో దయాకర్ కోరారు. గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, కొల్గూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి సునీతతో కలసి బుధవారం ప్రారంభించారు. వారితో ఎంపీఎం యాదగిరి, ఏఈవో అనూష, ఐకేపీ సీసీ పుష్పలత, సీఈవో రవీంద్రాచారి, పంచాయతీ సెక్రటరి శ్రీనివాస్, సంధ్య ఉన్నారు.



పాలమాకుల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో వేణుగోపాల్

● మిరుదొడ్డి: మండలంలోని కొండాపూర్, అందె, అల్వాల్, కూడవెళ్లి గ్రామాల్లో బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్‌కు 2203 రూపాయలు, సాధారణ ధాన్యానికి 2183 రూపాయలను ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం కృష్టారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు తదితరులున్నారు.

● దౌల్తాబాద్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఏపీఎం కిషన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూరంపల్లి, ముబారస్‌పూర్, హైమద్‌నగర్, మాచిన్‌పల్లి, గోవిందాపూర్ తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఏపీఎం కిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీసీలకు, వీఓఏలకు సూచించారు. కార్యక్రమంలో సీసీసీలు బాల్‌రజ్, రాజేష్, సునీత, వైకుంఠం, లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.



శనిగరంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్డీవో అదనపు అధికారి మధుసూదన్

● అక్కన్నపేట: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏపీఎం శ్రీనివాస్ కోరారు. బుధవారం అక్కన్నపేట మండలంలోని జనగామ, కేశనాయక్‌తండా, అంతకపేట, గొల్లకుంట, చౌటపల్లి, పెద్దతండా, మంచినీళ్ల బండ, రామవరం, గోవర్ధనగిరి, ధర్మారం, నందారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడు ధాన్యానికి రూ, 2203, బీ గ్రేడు ధాన్యానికి రూ, 2183 మద్దతు ధర చెల్లిస్తుందని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఇందులో సీసీలు తిరుపతి, శివ, రాజు, ఏఈవోలు సబియా, సింధుజ, ఐశ్వర్య, తదితరులు ఉన్నారు.



దౌల్తాబాద్‌లోని మాచిన్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం కిషన్

● కుకునూరుపల్లి: రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని ఉమ్మడి కొండపాక మండలం ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మాత్‌పల్లి, మెదినిపూర్, తిప్పారం, బొబ్బాయిపల్లి గ్రామాలలో అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎట్టి పరిస్థితుల్లో దళారులకు ధాన్యాన్ని విక్రయించవద్దని, రైతులందరూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని కార్యక్రమంలో ఏఈవోలు గ్రామపంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీఏవోలు, రైతులు పాల్గొన్నారు.



మాత్‌పల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం శ్రీనివాస్



కొండాపూలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



మౌలాన మృతదేహం

మిరుదొడ్డి, ఏప్రిల్ 3: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానిక ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భూంపల్లి గ్రామానికి చెందిన మౌలానా (30) అనే యువకుడు మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన బేబీతో 8సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహం జరిగిన నాటి నుంచి ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై గ్రామంలో రెండు రోజుల క్రితం పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా నిర్వహించారు. ఏం జరిగిందో కానీ, మంగళవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## తాళాలు పగులగొట్టి ఆలయంలో చోరీ

మిరుదొడ్డి, ఏప్రిల్ 3: తాళాలు పగులగొట్టి పెద్దమ్మ ఆలయంలో నగదు, బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన మిరుదొడ్డి మండలం లక్ష్మీనగర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయంలోని హుండీతోపాటు బంగారు, వెండి ఆభరణాలను దొంగలు ఎత్తికెళ్లినట్టు తెలిపారు. గ్రామ ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు మిరుదొడ్డి పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దొంగతనం కేసులో వ్యక్తి రిమాండ్

దూళిమిట్ట, ఏప్రిల్ 3: గత సంవత్సరం దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దూళిమిట్ట మండల శివారులో గల ఇండస్ టవర్ రూమ్ తాళం పగలగొట్టి గత సంవత్సరం ఆగష్టు 13న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఓ కంపెనీ టీఆర్ఎక్స్ కార్డ్ దొంగతనం చేశారని టవర్ విజిలెన్స్ టీం సభ్యుడు సింగారపు హరీక్రిష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా విచారణలో భాగంగా మంగళవారం లింగాపూర్ గ్రామానికి చెందిన గుజ్జుక బాబును విచారించగా చేసిన నేరం ఒప్పుకోవడంతో అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు మద్దూర్ ఎస్సై యూనస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్‌ఎస్‌ఎస్‌తో సేవాభావం పెంపొందుతుంది

● రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ





సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

గజ్వేల్, ఏప్రిల్ 3: ఎన్‌ఎస్‌ఎస్‌తో సేవాభావం పెంపొందుతుందని రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 స్పెషల్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన భారత ప్రభుత్వ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ.. సమాజ స్థితిగతులను మార్చడానికి జాతీయ సేవా పథకం ఎంతగానో తోడ్పడుతున్నదని, ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని హితవు పలికారు. జాతీయ సేవా పథకం ద్వారా ప్రవర్తనలో మార్పులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వచ్చిన స్టేట్ లైసన్ మాజీ ఆఫీసర్ శంకరయ్య మాట్లాడుతూ.. మనం అభివృద్ధి చెంది సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ నవీన్ సౌధ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి విజయ భాస్కర్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్. గణపతిరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అధ్యాపకులు ఓం ప్రకాశ్, సుంచు రాజు, లావణ్య, తిరుపతి, గ్రామస్థులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు

రాయపోల్, ఏప్రిల్ 3: దుబ్బాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా, మంత్రి కొండా సురేఖ ఆయనకు కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవడానికే కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలన్నదే తన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని, సంక్షేమ పథకాలు యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎన్‌సీసీ కేడెట్‌ల ఎంపిక



విద్యార్థులకు పరుగు పందెం నిర్వహిస్తున్న అధికారులు

గజ్వేల్, ఏప్రిల్ 3: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను సికింద్రాబాద్-2(టీ) బెటాలియన్ అధికారులు పవన్‌కుమార్, భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో 13 సంవత్సరాల వయసున్న ఏడో తరగతి, 8వ తరగతి విద్యార్థులకు 400 మీటర్ల రన్నింగ్, షటిల్ రన్, పుష్ అప్స్, పుల్లప్స్ పోటీలను నిర్వహించారు. బాలురు 33మంది బాలికలు 17మందిని ఎన్‌సీసీ కేడెట్లుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ విజయపాల్‌రెడ్డి, కాట రాయప్ప, ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

● చేర్యాల సీఐ శ్రీను



చేర్యాలలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీను

చేర్యాల, ఏప్రిల్ 3: విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. సైబర్ జాగ్రూక్త దివాస్ సందర్భంగా బుధవారం చేర్యాల పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సైబర్ నేరాలు, గంజాయి, ఇతరత్రా మత్తుపదార్థాలను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. సాంకేతికతతో మనిషి మనుగడ ముడిపడి ఉన్న నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం మహిళా రక్షణ చట్టాలను వివరించారు. కార్యక్రమంలో చేర్యాల ఎస్ఐ దామోదర్, హుస్నాబాద్ షీ టీం బృందం సభ్యులు సదయ్య, స్వప్న, ప్రశాంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డిలో..**

మిరుదొడ్డి, ఏప్రిల్ 3: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మిరుదొడ్డి ఎస్ఐ పర్శరాములు అన్నారు. బుధవారం మండలంలోని కాసులాబాద్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి అడిగితే చెప్పకూడదన్నారు. విద్యార్థులు ఫోన్లను ఉపయోగవించ వద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### దొడ్డి కొమురయ్యకు నాయకుల నివాళులు

చేర్యాల, ఏప్రిల్ 3 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 97వ జయంతిని బుధవారం చేర్యాలలో కురుమసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక అంగడిబజారు చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు అందె బీరయ్య, కామల్ల అనిల్, బండారి అంజయ్య, అందె నాని తదితరులు కొమురయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

### ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చందు

మిరుదొడ్డి, ఏప్రిల్ 3: మండలంలోని కాసులాబాద్ గ్రామానికి చెందిన ర్యాగట్ల చందును ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

### ఒలింపియాడ్ పరీక్షలో పంచతంత్ర విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, ఏప్రిల్ 3: చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో మూడుర్యాంకులు సాధించారు. నాల్గో తరగతి విద్యార్థి ఎ.కార్తికేయ, 5వతరగతి విద్యార్థి జి. జశ్వంత్, ఎ. వర్షత్ జిల్లాస్థాయి రెండో బహుమతి సాధించారు. ఈసందర్భంగా బుధవారం సికిందరాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరామ్, మాస్టర్ మైండ్స్ చైర్మన్ సంగాని రాజు చేతులమీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

కోహెడ, ఏప్రిల్ 3 : మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ చుంచు రంజిత్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన మరి కొంతమందితో కలిసి పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు సక్రు, సీనియర్ నాయకులు షేక్ అలీ, అసర్ల ఎల్లయ్య, మంద రాజారాం, సంచు రాజు పాల్గొన్నారు.



## మంత్రి చొరవతో ఆర్టీసీ బస్సు సౌకర్యం



గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సు

దూళిమిట్ట, ఏప్రిల్ 3: మండలంలోని కొండాపూర్ గ్రామానికి హుస్నాబాద్ నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ.. మంగళవారం ఎంపీటీసీ ఇస్లావత్ నముకు, గ్రామస్థులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హుస్నాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామానికి వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని హుస్నాబాద్ డిపో అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో బుధవారం కొండాపూర్ గ్రామానికి అధికారులు బస్సు సౌకర్యం కల్పించారు. వినతిపత్రం అందించిన 24 గంటల్లోపే బస్సు సౌకర్యం కల్పించిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

## తల్లిపాలు తాగి రొమ్మునే గుద్దుతారా

● బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 3: బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి, తల్లిపాలు తాగి రొమ్మును గుద్దినట్లుగా వ్యవహరించారని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్లు వజీర్, సాయి ఈశ్వర్‌గౌడ్, సద్ది నాగరాజు రెడ్డిలతో కలిసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని 7, 20, 37 వార్డుల్లో అభివృద్ధి జరగలేదని అసత్య ఆరోపణలు చేసి, కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కౌన్సిలర్లకు ఆ వార్డు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు అన్ని పనులు చేయించుకుని, అధికారం పోగానే ఇలా వ్యవహరించడం దిక్కుమాలిన చర్యగా భావిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాందుల పురం రాజు, పెర్క బాబు, కోడూరి నరేష్, బత్తుల శ్రీనివాస్, సామల్ల సాయిప్రేమ్, పెర్క నాగరాజు, నరెష్ గుడికందుల, జాఫర్, సత్తర్, ముక్తార్, సాజీద్, అదీక్, ఇమ్రాన్, అఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

● ఎంపీడీవో రాంమోహన్

మద్దూరు, మార్చి 3: ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, వాటర్‌మెన్స్, ఉపాధిహామీ సిబ్బంది, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉపాధిహామీ కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ కూలీలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీదేవి, ఈసీ పర్శరాములు, వైద్యాధికారులు రజిత, స్టువర్ట్ సన్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మర్మాముల గ్రామంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న భూమి చదును పనులని ఎంపీడీవో ఎస్. రాంమోహన్ బుధవారం పరిశీలించారు. అనంతరం హరితహారం కోసం మొక్కల్ని సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖజామొయినుద్దీన్, పంచాయతీ సెక్రటరీ రేణుక, ఫీల్డు అసిస్టెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## వర్గల్ గ్రామస్థులంతా నా ఆత్మీయులే

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, ఏప్రిల్ 3: వర్గల్ గ్రామ ప్రజలంతా తన ఆత్మీయులేనని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం వర్గల్ గ్రామంలో వివాహ వేడుకలకు హాజరై వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## నీటిని విడుదల చేయడం హర్షణీయం

దుబ్బాక, ఏప్రిల్ 3: కూడవెళ్లి వాగులోని నీటిని విడుదల చేయడాన్ని హర్షిస్తూ బుధవారం దుబ్బాకలో బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండా సురేఖ, దుబ్బాక కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, అనంతుల శ్రీనివాస్, వెంకటస్వామి గౌడ్, ప్రభాకర్, మచ్చ శ్రీనివాస్, రాజిరెడ్డి, కిషన్‌రెడ్డి, బాలకిషన్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

వర్గల్, ఏప్రిల్ 3: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వర్గల్ జడ్పీటీసీ బాలు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామంలోని మహ్మదీయ మజీద్‌లో సాయంత్రం ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జడ్పీటీసీ స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు వాజీద్‌పాషా, రహిమొద్దీన్, జలీల్, జహీర్, బాబా, చాంద్, అల్లావుద్దీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్



దుకాణంలో స్టాక్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్

దౌల్తాబాద్, ఏప్రిల్ 3: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లను, బిల్ బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విధిగా బిల్లులు ఇవ్వాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణాల నిర్వాహకులకు సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు రైతులకు అమ్మితే లైసెన్సులు రద్దు చేయాలని వ్యవసాశాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ మొక్క రోజుకు 200 లీటర్ల నీటిని తీసుకుంటుందన్నారు. ఆయిల్ పామ్ పంటలకు, తోటలకు నీటి యాజమాన్యం తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏవో గోవిందారాజులు, తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాజ్



నంగునూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దౌల్తాబాద్/నంగునూరు ఏప్రిల్ 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాజకీయంగా మాదిగలకు అన్యాయం చేస్తూ, మాలలకు ఉన్నత పదవుల నుకట్టబెట్టి, ఎంపీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లను కేటాయించిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దప్పు శివరాజ్ మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 80 లక్షల జనాభా ఉన్న మాదిగలను కాదని, మాలలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు అవకాశం కల్పించకుండా కాంగ్రెస్ పార్టీ తీరని అన్యాయం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ టీఎస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి దేవులపల్లి రాజేందర్ అన్నారు. బుధవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జనాభా ప్రతిపాదికన ఎక్కువ శాతం ఉన్న మాదిగలకు టికెట్ కేటాయింపు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు

నంగునూరు, ఏప్రిల్ 3: పంచాయతీ కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ, బుధవారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయంలో మండల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు నెల నెల జీతాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. ఖాత, రాంపూర్ గ్రామాల్లో నాలుగు నెలలుగా, అప్పలాయచెరువు గ్రామంలో ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పూట గడవడం కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య, నాయకులు శ్రీనివాస్, సుధాకర్, రేణుక, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మనువాద ముసుగులో దళితులపై దాడులు

● జాతీయ మాలమహానాడు నాయకులు

బెజ్జంకి/చేర్యాల ఏప్రిల్ 3: మనువాద ముసుగులో దళితులపై దాడులు జరుగుతున్నాయని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉన్నదని జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య అన్నారు. రాజ్యాంగ రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ.. బుధవారం మండల కేంద్రంలో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల. శేఖర్ బాబు, మండల అధ్యక్షుడు బాల నర్సు, రాజు, మల్లయ్య ప్రవీణ్, శంకర్, శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు. ఈనెల 8న హైదరాబాద్‌లో నిర్వహించే రాజ్యాంగ రక్షణయాత్ర సభను విజయవంతం చేయాలని కోరుతూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను బుధవారం కొమురవెల్లిలో జడ్పీటీసీ సిలివేరు సిద్దప్ప, నాయకులు తలారి కిషన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కనక మల్లేశం, సుమన్, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ మాల మహానాడు సభ్యులు

## ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

మద్దూరు/దూళిమిట్ట/అక్కన్నపేట: మండల ఎంఆర్సీ కార్యాలయం ఇన్‌చార్జి విద్యాశాధికారిగా తగిరెడ్డి దేశిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంఈవో మొగుళ్ల నర్సింహారెడ్డి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఎంఈవో దేశిరెడ్డి అక్కన్నపేట, దూళిమిట్ట మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా వ్యవహరించనున్నారు. నూతన ఇన్‌చార్జి ఏంఈవో తగిరెడ్డి దేశిరెడ్డిని, ఉద్యోగ విరమణ పొందిన నర్సింహ్మారెడిని దూళిమిట్ట మండల వివిధ ఉపాధ్యాయ సంఘాల సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్‌బాబు, ఉపాధ్యాయులు రాములు, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చేర్యాల: చేర్యాల ఇన్‌చార్జి ఎంఈవోగా కొండపాక ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి విధులలోకి చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులలో సంతకాలు చేసి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత



మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్ఐ మహేశ్

హుస్నాబాద్, ఏప్రిల్ 3: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో స్వాధీనం చేసుకుని ఫోన్ యజమాని దొంతరవేణి రాజ్‌కుమార్‌కు బుధవారం ఎస్ఐ తోట మహేశ్ అందజేశారు. రాజ్‌కుమార్ పట్టణంలోని మార్కెట్‌లో తన ఫోన్ పోగొట్టుకున్నాడని, ఫోన్ పోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని ఎస్ఐ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్‌ను ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించినట్లు చెప్పారు.